క్లుప్తంగా

గంగిరెడ్డి మాస్టారు సేవలు చిరస్మరణీయం



రెంటచింతల: మూడు దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడిగా పనిచేసి విద్యావిలువలు, మానవతా విలువలు, సంస్కారం, జీవన నైపుణ్యాలతో కూడిన క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందజేసిన గంగిరెడ్డి మాస్టారు సేవలు చిరస్మరణీయమని విశ్రాంత హెచ్ఎం ప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక శివాలయం ఆలయంలోని మోదుగు లక్ష్మారెడ్డి కల్యాణ మండపంలో రిటైర్డ్ హెచ్ఎం పల్లెర్ల గంగిరెడ్డి మాస్టారు సంతాపసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటితరం ఉపాధ్యాయులకు గంగిరెడ్డి మాస్టారు ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఎంఈవో–2 వై.శివనాగేశ్వర రావు, దుర్గాప్రసాద్, విశాంత హెచ్ఎంలు పెద్దిరెడ్డి సైదారెడ్డి, పల్లెర్ల ఆంజనేయ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నోటు కొండారెడ్డి, వైఆర్ఎస్ స్కూల్ అధ్యక్షుడు బద్దెగం అప్పిరెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాపయ్య, వైఆర్ఎస్ స్కూల్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొని గంగిరెడ్డి మాస్టార్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

ఈపూరు(శావల్యాపురం): ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం అధికారి (డీడీఏ) మద్దినేని శివకుమారి సూచించారు. మంగళవారం ఈపూరు మండలం కొచ్చర్ల, ఉప్పరపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా డీడీఏ శివకుమారి మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను ఉపయోగించి భూమి సారాన్ని పరిరక్షించాలన్నారు. వరి మొక్కజొన్న మిరప పంటలను సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కౌలు రైతు కార్డులు నమోదు, పంట నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో అరుణ, ఏవో రామినేని రామారావు, ఏఈవోలు కిషోర్ కుమార్, సునీత, వీఏఏ కోటేశ్వరరావు, రైతులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, శరభయ్య పాల్గొన్నారు.

పంటల బీమా సద్వినియోగం చేసుకోండి

రొంపిచర్ల: పంటల బీమాను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. మండలంలోని వీరవట్నం, అన్నవరప్పాడు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరి పంటకు ఎకరానికి రూ.80 ప్రీమియం రైతు చెల్లించాలన్నారు. అలాగే ఎర్రమిరప పంటకు ఎకరాకు రూ.360లు, కంది పంటకు ఎకరాకు రూ.40లు చొప్పున చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ ప్రీమియంను సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌కు గాని, అసిస్టెంట్‌కు గాని, సీఎస్సీ సెంటర్‌లో, పోస్టాఫీస్సుల్లో కూడా చెల్లించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్, వెటర్నీ అసిస్టెంట్‌లతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

టాటా వ్యాసరచన పోటీల్లో పతకాలు



నరసరావుపేట: స్థానిక కె-రిడ్డ్ పాఠశాలలో మంగళవారం టాటా కంపెనీ ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ స్థాయిల్లో నిర్వహించిన స్వీయ ఆధారిత భారతదేశాన్ని నిర్మించేందుకు నేనే చేసే ఐదు పనులు (ఫైవ్ థింగ్స్ ఐవిల్ డూ టు బిల్డ్ ఏ సెల్ఫ్ రిలయంట్ ఇండియా) అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దీనిలో పాల్గొన్న పాఠశాలకు చెందిన పి.వెంకట శ్రీజాహ్నవి (7వ తరగతి), ఎ.దేవీదీక్ష (9వ తరగతి) బంగారు పతకాలు సాధించగా షేక్ అబ్దుల్ లతీఫ్ (6వ తరగతి), కావ్యశ్రీ భాయ్ (9వ తరగతి)లు రజితం పతకం, కె.సాయి సంప్రీత్ (8వ తరగతి), సీహెచ్. హరి తేజస్వి (9వ తరగతి) కాంస్య పతకం పొందారు. వీరందరూ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించి అభినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ జి.బర్నబాస్, డైరక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజి పాల్గొనగా టాటా సంస్థ ప్రతినిధులు సందీప్ రామాంజనేయులు పర్యవేక్షించారు.

పనిచేయకపోతే చర్యలు

నూజెండ్ల: చెత్త సేకరణ చేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న క్లాప్‌మిత్రలను తొలిగించటం జరుగుతుందని ఎంపీడీవో పి.ఉమాదేవి హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో మురుగు నిల్వలు ఉన్నా, చెత్త కనిపించినా క్లాప్‌మిత్రలతో పాటు పంచాయితీ సెక్రటరీలు బాధ్యత వహించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, కంచర్ల సుబ్బరామయ్య,సెక్రటరీ ప్రభాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

కొనసాగిన కార్మికుల సమ్మె



పిడుగురాళ్లలో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు



మాచర్లలో దీక్ష చేస్తున్న పురపాలక సంఘం కాంట్రాక్టు వర్కర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు మంగళవారం పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గత పది రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ అరకొర వేతనాలు పెంచి, చేతులు దులుపుకొంటుందని ఆయన విమర్శించారు. అదేవిధంగా ఇతర కార్మిక సంఘాలు కలిసి రాకపోవడం వలన కార్మికులకు మెరుగైన జీతాలు, సౌకర్యాలకై పూర్తి స్థాయిలో పోరాటం చేయలేకపోయామని, ఈ రోజు మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణతో యూనియన్ బృందం చర్చలు జరిపిన సందర్భంగా సమ్మె కాలపు డిమాండ్లను, తల్లికి వందనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ తదితర డిమాండ్లను ముఖ్యమంత్రితో చర్చించి అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మెను ఆగస్టు 4వ తేదీ వరకు వాయిదా వేయడం జరిగిందన్నారు. ఆగస్టు 5వ తేదీ నుంచి కార్యాచరణని ప్రకటిస్తామన్న రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తాత్కాలికంగా సమ్మె విరమించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు మధు, పవన్‌కుమార్, రమేష్, విజయ్, సురేష్, నాగూర్‌వలి, రత్నకుమార్, నాగేశ్వరరావు, కుంభ కొండలు, వీరమ్మ, మేరి, ప్రసన్న, మార్తమ్మ, దేవరకొండ లక్ష్మీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల: పట్టణంలోని పురపాలక సంఘం కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం భారీగా పురపాలక సంఘం కార్యాలయ ముందుకు చేరుకొని దీక్షలు కొనసాగించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరవధిక సమ్మెను ఉద్దేశించి సీఐటీయూ నాయకులు బండ్ల మహేష్, సురేష్, వెంకట్రావులు మాట్లాడుతూ కార్మికులను ప్రభుత్వం మోసగిస్తుందన్నారు. తాత్కాలికంగా ఏదో జీతాలు పెంచారని చెబుతున్నా, శాశ్వతంగా కార్మికుల హక్కులను పరిరక్షించే ప్రయత్నం చేయటం లేదన్నారు. ఈ స్థితి వలన పురపాలక సంఘ కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత విషయాన్ని గమనించి వెంటనే జీఓ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, గత సమ్మెకాల ఒప్పందం చేయాలని కోరారు. తల్లికి వందనం అమలు చేయాలని, పట్టణానుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ వెంకటరమణ, గురవయ్యతో పాటు పలువురు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

నూజెండ్ల: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించటానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఛీఫ్ విప్, ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఐనవోలు గ్రామంలో నూతన ప్రభుత్వ వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ నూతన వైద్యశాల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు చేరువయ్యాయన్నారు. నూతన పిహెచ్‌సిలో ఆధునిక వైద్య పరికరాలుతో పాటు తగినంత సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా జిడిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు ముంద్రు సుబ్బారావు పాల్గొన్నారు.

రొంపిచర్లలో భారీ వర్షాలు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాలో భారీ వర్షాలు కురిశాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో మంగళవారం ఉదయానికి 37.8 ఎం.ఎ. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. గత మూడు రోజులుగా మండలంలో వర్షాలు కొనసాగుతున్నాయి. వర్షానికి పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షాల కారణంగా కొన్ని గ్రామాల్లోని రోడ్డు చిత్తడిచిత్తడిగా మారాయి. వ్యవసాయ పనులు నిలిచిపోయాయి.

బంగారు మైసమ్మ బోనాల పండుగ



పూజలందుకుంటున్న బంగారు మైసమ్మ



బంగారు మైసమ్మ జాతర సందర్భంగా బోనాల ఊరేగింపు

మాచర్ల: పట్టణంలో ఆషాఢమాసం ముగింపు సందర్భంగా మాచర్లలోని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రెండవ రోజు కుల దేవతలైన గుర్రప్ప స్వామి, మైసమ్మ తల్లికి బోనాల జాతరను సంఘ పెద్ద మాచర్ల వెంకటేశ్వర్లు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బంగారు మైసమ్మ తల్లికి ఉదయం ప్రత్యేక పూజలు జరిపి అలంకరించి ఉత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులందరూ భారీ స్థాయిలో గుర్రప్ప స్వామి, మైసమ్మ తల్లి జాతరలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో మహిళలు బోనాలను కోదండ రామాలయం నుంచి పట్టణంలో బోనాలు అమ్మవారికి ఊరేగింపు జరిపారు. మాచర్ల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులంతా భారీ స్థాయిలో పాల్గొని భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. అదేవిధంగా మేళతాళాలతో రథం బజారు, బురుజు సెంటర్ నుంచి మైసమ్మ గుడి వరకు వందలాది మందితో బోనాల ఊరేగింపు జరిగింది. పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు భారీ స్థాయిలో అమ్మవారికి జేజేలు పలికారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని జరిపారు.

'పెన్షన్ వ్యాలిడేషన్' బిల్లును రద్దు చేయాలి

మాచర్ల రూరల్: పార్లమెంట్‌లో పాస్ చేయించిన పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని పెన్షన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ హాలులో పలువురు సభ్యుల సన్మాన కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన సభలో రామకృష్ణారావు మాట్లాడుతూ ఈ బిల్లు భారతదేశంలో సర్వీస్ పెన్షనర్ల ప్రయోజనాలని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. పెన్షన్ ఫిక్సేషన్ లాంటి ప్రయోజనాలు కోల్పోతారన్నారు. 12వ పీఆర్సీ ఆలస్యం అయ్యిందన్నారు. మూడు కరువు భత్యాలను ప్రభుత్వం బకాయి ఉందన్నారు. 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాల్సి ఉందని, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈహెచ్ఎస్‌కి సంబంధించిన ప్రయోజనాలు సకాలంలో అమలు కావటం లేదన్నారు. నష్టపోయిన క్వాంటం ఆఫ్ పెన్షన్ ప్రయోజనాలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. వెంకటరెడ్డి, చంద్రయ్య, గాలీబ్, గౌస్ మొహిద్దీన్, సుబ్బారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలి

తహసీల్దార్ కె.నగేష్



రేషన్ డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కె.నగేష్

ముప్పాళ్ళ: మండల పరిధిలోని డీలర్లు నిత్యావసర సరుకులను సకాలంలో కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ కె.నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాల రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నగేష్ మాట్లాడుతూ ప్రతి నెల 26వ తేదీ నుంచి 30 వరకు వికలాంగులు, 65 సంవత్సరాలు పై బడిన వారికి డోర్ డెలివరీ చేయాలన్నారు. 1వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా చౌక ధరల దుకాణం మూసి వేయకూడదని, అదే విధంగా పంపిణీ విషయంలో కార్డుదారుల నుంచి అభ్యంతరాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ ఎం.వి. చరణ్, ఎస్ఐ వంశీకృష్ణ



మాట్లాడుతున్న సీఐ హైమారావు

పలు కళాశాలల్లో డ్రగ్స్‌పై అవగాహన సదస్సు

నరసరావుపేట టౌన్: విద్యార్థి దశ ఎంతో విలువైనదని మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఎం.విజయ్ చరణ్, హైమారావులు అన్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు కళాశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అన్న అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మంచి భవిష్యత్తు నిర్మించుకొని ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. ఒత్తిడి వచ్చినప్పుడు దాన్ని అధిగమించటానికి క్రీడలు, సంగీతం, యోగా వంటివి అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హరిబాబు, వంశీకృష్ణ, మహిళ ఎస్ఐలు లేఖ ప్రియాంక, అరుణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలను సందర్శించిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, వసతులు విద్యార్థుల భవిష్యత్తుకు ఒక వరం అని తెలిపారు. అటల్ ల్యాబ్, ఒకేషనల్ ల్యాబ్, పీఎంశ్రీలో జరుగుతున్న లైబ్రరీ వర్క్, రాంప్ రైలింగ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, ప్లే ఫీల్డ్ తదితర పనులను, స్కూల్ క్వాలిటీ ఎసెస్‌మెంట్ ఫ్రేమ్ వర్క్, ఇతర అంశాలను పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలో ఉన్న రైసింగ్ స్టార్ విద్యార్థుల స్థాయిని పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యం పెరగాలని, సరియైన బోధన ద్వారా మాత్రమే విద్యార్థులు స్థాయి పెంచవచ్చునని ఉపాధ్యాయులకు తెలిపారు. పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి నిలిపి ఉత్తీర్ణత శాతం పెంచాలని అన్నారు. ఏఎంవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అహోరాత్ర రుద్ర పారాయణ యాగం

వినుకొండ : పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ పక్కన గల పాత శివాలయంలో పట్టణ అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో అహోరాత్ర రుద్ర పారాయణ యాగం ఘనంగా నిర్వహించారు. ఈ యాగంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కల్యాణం కోసం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పురోహిత సంఘం ఈ యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, సంఘం సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు రూ.2 కోట్లు

నరసరావుపేట: నియోజకవర్గంలో ఆధునిక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యవేక్షణలో అమలు చేస్తారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో 42 సెంట్ల స్థలంలో ఈ డిజిటల్ లైబ్రరీ నిర్మాణం చేస్తామన్నారు. మంగళవారం ఆ స్థలాన్ని ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని వారు తెలిపారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి



నరసరావుపేటరూరల్: దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. విచారణలో ఉన్న కేసుల యొక్క పురోగతి, దర్యాప్తు అంశాలను పరిశీలించారు. దర్యాప్తులో ఉన్న కేసులలో సత్వరమే దర్యాప్తు పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సీసీటీఎన్ఎస్ పనితీరు గుర్తించి సీఐ పి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. విచారణలో ఉన్న పోక్సో కేసులు, ఎస్‌సీ,ఎస్‌టీ అట్రాసిటీ కేసులపై ఆరా తీసారు. రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజుఉల్ పోలీసింగ్ నిర్వహించి, అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. పెండింగ్ కేసులు తగ్గించాలని, దొంగతనం కేసులలో ప్రాపర్టీ రీకవరిపై దృష్టిసారించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన పిటీషన్‌లను త్వరిగతిన విచారించి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఫైరోజ ఫాతిమాలు పాల్గొన్నారు.

అన్నదాతల్లో వర్షాతిరేకం

వ్యవసాయ పనులు ముమ్మరం



రెంటచింతల పంటపొలంలో సాళ్లు తోలుతున్న రైతు, విత్తనాలు వెదపెడుతున్న కూలీలు

రెంటచింతల: వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా మండలంలోని వివిధ గ్రామాల్లో కొద్ది రోజులుగా చిరు జల్లులు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. జూన్ నెలలో 58 మి.మీ.లకు గాను 10 మి.మీ.లు, జూలైలో 114 మి.మీ.లకు గాను ఇప్పటికే 72 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు మండల వాతావరణ శాఖ సూపర్‌వైజర్ బద్దిగం ఈశ్వర్‌రెడ్డి వెల్లడించారు. జూలై నెలలో ఇప్పటివరకు సకాలంలో చిన్నపాటి వర్షాలు కురవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు పూర్తిస్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి విత్తనాలు వేసే పనులు, వరి దమ్ములు, సాళ్ల తోలే పనులతో రైతులు, కూలీలు బిజీబిజీగా ఉన్నారు. మండల వ్యవసాయాధికారి కట్టా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 10,358 హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉండగా మిర్చి 2,747 హెక్టార్లులో, పత్తి 3,162 హెక్టార్లలో, వరి 2,836 హెక్టార్లలో, కంది 1,154 హెక్టార్లలో, అపరాలు 459 హెక్టార్లలో వేయనున్నట్లు అంచనావేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల వలన కృష్ణా జలాలు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు వస్తుండటంతో ఈప్రాంత రైతులలో సంతోషం వెల్లివిరుస్తుంది.

ఘనంగా నవచండీ యాగ మహోత్సవం



ప్రత్యేక పూజలందుకుంటున్న అమ్మవారు

మాచర్ల: పట్టణ శివారులో ఉన్న ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లో మహా సరస్వతి చండీపరదేవత స్వశక్తి అనుగ్రహం కోసం మద్దిగపు శివరామిరెడ్డి, యోగిత దంపతుల ఆధ్వర్యంలో జరుగుతున్న నవచండీ మహాయజ్ఞం మంగళవారం రెండోరోజూ కొనసాగాయి. అందులో భాగంగా ప్రత్యేక చండీయాగ మహోత్సవంలో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అలంకరణ చేశారు. పలువురు అర్చకుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు. ఉదయం 9గంటల నుంచి యజ్ఞమంటప పూజలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ లక్ష్మీ సుదర్శన, రుద్రపూర్వక నవచండీ మహాయాగం కార్యక్రమాలను మధ్యాహ్నం వరకు నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమానికి పట్టణం, గ్రామీణ ప్రాంతం నుంచి వందలాది మంది మహిళలు, ప్రజలు, భక్తులు భారీస్థాయిలో పాల్గొన్నారు. మధ్యాహ్నం వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో మద్దిగపు శివరామిరెడ్డితో పాటు పలువురు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఎంఎస్ఆర్ టౌన్‌షిప్‌లో భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం జరిపారు. రెండు రోజుల పాటు నవచండీ యాగ మహోత్సవం ఘనంగా జరిగింది. పలువురు అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు బారులు తీరారు.

కేరళను మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మహనీయుడు అచ్యుతానందన్

సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

సత్తెనపల్లి: కేరళ రాష్ట్రాన్ని మోడల్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన మహనీయుడు కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్ మృతి దేశానికి, సీపీఎం ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి డి.విమల అధ్యక్షత మంగళవారం జరిగిన అచ్యుతానందన్ సంతాప సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అచ్యుతానందన్ చదువు పాఠశాల వరకే పరిమితమైనప్పటికీ, సీపీఎం ఉక్కు క్రమశిక్షణే ఆయనను ముఖ్యమంత్రి స్థాయి వరకు తీసుకువెళ్లిందన్నారు. పార్టీ నిబంధనలకు కట్టుబడి ఉండే అంతరంగిక పోరాటం చేశారన్నారు. అచ్యుతానందన్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటన్నారు. సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ అచ్యుతానందన్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ముందుగా అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప సభలో సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, నాయకులు శివదుర్గారావు, వీరబ్రహ్మం, సూర్యప్రకాశరావు, సుసులోన్, ప్రభాకర్, రాజ్‌కుమార్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నూజెండ్ల: ద్విచక్ర వాహనం నడుపుతూ అదుపు తప్పి క్రింద పడటంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది.

కుటుంబ సభ్యులు తెలపిన వివరాల ప్రకారం ఈ నెల 18 వ తేదీన మారెళ్ళవారిపాలెం గ్రామానికి చెందిన బత్తుల సాంబయ్య (63) పనుల నిమిత్తం వినుకొండ వెళ్ళి రాత్రికి తిరిగి స్వగ్రామం బయలు దేరాడు. తలార్లపల్లె సమీపంలో కాలువకట్ట వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రగాయాలు కావటంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుణ్ణి వినుకొండ వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. వైద్యశాలలో నాలుగు రోజులుగా చికిత్స పొందతూ పరిస్థితి విషమించటంతో సాంబయ్య మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య సావిత్రి, కొడుకు,కూతురు ఉన్నారు.

పాత విధానంలో పోషకాహారం పంపిణీ చేయాలి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే పోషకాహారం పాత విధానంలో పంపిణీ చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం సమగ్ర శిశు అభివృద్ధి కేంద్ర కార్యాలయం ఎదుట బాలింతలు, గర్భిణులతో కలిసి నిరసన తెలిపి పీడీ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని నిరసిస్తున్నామన్నారు. చిన్నపిల్లలతో గంటల తరబడి కేంద్రాలలో కూర్చోవడం కష్టమని, ఫేస్‌యాప్ కారణంగా పదేపదే కేంద్రాలకు రావాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాధవి, రమణ, పద్మ, సాయి, తులసి పాల్గొన్నారు.